క్లుప్తంగా

హరీశ్‌రావును కలిసిన సురేశ్ రాజ్



హరీశ్‌రావుతో సురేశ్

దుద్యాల్: బీఆర్‌ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావును లగచర్ల ఘటనలో ఏ2 నిందుతుడు, మండల యూత్ అధ్యక్షుడు బోగమోని సురేశ్ శనివారం కలిశారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ మండలంలో ప్రస్తుత పరిస్థితులను వివరించినట్లు ఆయన తెలిపారు. దుద్యాల్ మండలంలోని లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి గ్రామాల రైతుల భూముల్లో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేసేందుకు భూసేకరణ జరుగుతున్న విషయం తెలిసిందే. ఇదే విషయంపై వారు చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు.

కొనసాగుతున్న ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్నెపల్లిలో వెలసిన తోట్ల ఎల్లమ్మ ఆలయంలో పరుశురామ నాగ ప్రతిష్ఠ పూజలు కొనసాగుతున్నాయి. శనివారం అవాహిత పూజ, నవగ్రహ అవాహనం, శయ్యాదివాసం, పుష్పాదివాసం, నవగ్రహహోమం వాస్తు ప్రతిష్ఠ హోమాలు, సామూహిక హోమాలు చేశారు. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు. గీతావాహిణి ఆధ్వర్యంలో సామూహిక గీతాపారాయణం చేపట్టారు. ఈ ఉత్సవాల్లో ఆలయ పునర్‌నిర్మాణకర్త రత్నారెడ్డి, పలువురు ప్రముఖులు, ఎన్నెపల్లి గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



దుద్యాల్: మహిళా ఉపాధ్యాయులను సన్మానించి బహుమతులు అందజేత

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో నేతాజీ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మహిళా దినోత్సవం కావడంతో పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పలువురు మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు వారివారి అభిప్రాయాలను తెలియజేశారు. డీఈవోగా చందన, హెచ్‌ఎంగా హారిక వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిలు, ఉపాధ్యాయులు రవి, మోహన్, మంజుల, కవిత, అనిత, పరమేశ్వరి, మానేశ్వర్, నవనీత, భాగ్యమ్మ, మధినా, కవిత పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి

తాండూరు రూరల్: మహిళలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎల్‌ఎస్‌ఆర్ యువసేన వ్యవస్థాపకుడు లొంక నర్సిములు పేర్కొన్నారు. మహిళ దినోత్సవం సందర్భగా శనివారం గాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మహిళా ఉద్యోగులు పంచాయతీ కార్యదర్శి సుశీల, అంగన్‌వాడీ టీచర్లు జహంగీర్ బేగం, బీబీ, ఆశవర్కర్ చంద్రకళలను శాలువ కప్పి సన్మానించారు.

విహార యాత్రలతో విజ్ఞానం

ఎన్కేపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం జ్యోతి

బొంరాస్‌పేట: విహార యాత్రలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించవచ్చని హెచ్‌ఎం జ్యోతి పేర్కొన్నారు. ఎన్కేపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం విహారయాత్రకు హైదరాబాద్ వెళ్లారు. అక్కడ బిర్లా మందిర్, సాలార్ జంగ్ మ్యూజియం, సచివాలయం, హుస్సేన్‌సాగర్‌లోని బుద్ధ విగ్రహం, ట్యాంక్‌బండ్, శిల్పారామం, రాష్ట్రపతి భవన్, శంషాబాద్ విమానాశ్రయాన్ని సందర్శించారు. ఆయా ప్రదేశాల్లోని ప్రత్యేకతలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్‌కుమార్, అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు శివలీల, సంతోష, అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.



వెల్‌చాల్ నరసింహా స్వామి ఆలయం



లక్ష్మీనరసింహా స్వామి మూలవిరాట్

నేటి నుంచి జాతర

- ముస్తాబైన నరసింహా స్వామి దేవాలయం
- పుణ్యక్షేత్రంగా రూపుదిద్దుకుంటున్న పులిలొంక

మోమిన్‌పేట: మండల పరిధిలోని వెల్‌చాల్ గ్రామంలో చుట్టూ ఎతైనా గుట్టలు, దట్టమైన అడవి, అహ్లాదకరమైన ప్రదేశంతో పచ్చని చెట్ల మధ్య వెలసిన లక్ష్మీ నరసింహా స్వామి జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభించనున్నారు. దీనికోసం స్వామి వారిని ముస్తాబు చేస్తున్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. 9వ తేదీన ధ్వజరోహణ, బోనాలు, పల్లకీ సేవ, 10వ తేదీన స్వామి వారి రథోత్సవం, 11వ తేదీన స్వామి వారి కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదానం, పెరుగు వసంతం నిర్వహించనున్నట్లు జాతర ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆలయ చరిత్ర..

అది దట్టమైన అడవి..ఒక్కప్పుడు పులులు సంచరించే ప్రదేశం. అక్కడికి వెళ్లాలంటే భయపడేవారు. ప్రస్తుతం లక్ష్మీ నరసింహాస్వామి దేవాలయంగా రూపుదిద్దుకొని పుణ్యక్షేత్రంగా తయారైంది. 65 సంవత్సరాల క్రితం అడవికి వెళ్లాలంటే అందరికీ భయం వేసేది. మేకల కాపరిగా వెళ్తూ కొన్ని సంవత్సరాలు ఒంటరిగా 20మీటర్ల పొడవు, నాలుగు మీటర్ల వెడల్పుతో పెద్ద గుహను తొలిచి లక్ష్మీనరసింహాస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించాడు. కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అన్నా నానుడి నిజం చేశాడు మేకల కాపరి. దీంతో అక్కడ ఆ విగ్రహాలు కాల క్రమేణ పూజలందుకుంటూ 'పులిలొంక' పుణ్యక్షేత్రంగా మారింది.

దినదినాభివృద్ధి..


లక్ష్మీనరసింహాస్వామిని దర్శించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా వస్తుంటారు. భక్తులు ఇచ్చే విరాళాలతో దేవాలయాన్ని పరమదాసు అభివృద్ధి చేశాడు. భక్తులకోసం మంచి నీటి సౌకర్యం కల్పించేందుకు కొలను నిర్మించారు. ప్రతీ సంవత్సరం పాల్గుణ శుద్ధనవమి నుంచి ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తారు. దీనికోసం భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు.

ఆలయ ప్రాంగణంలో..

ఆలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామి దేవాలయం, శివాలయం, గుహలో వేంకటేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. సంతానం లేని జంటలు కొబ్బరి కాయలతో ముడుపులు కట్టి అక్కడ ఉండే మేడి చెట్టుకు కడితే ఏడాది లోపు సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాశం.

ప్రత్యేక ఆకర్షణగా గుహ..

దైవ సంకల్పంతోనే ఈ మహత్కర పనిని పూనుకున్నానని పరమదాసు పేర్కొంటాడు. ఓ మనిషి ఒంటరిగా 20 మీటర్ల పొడవు, నాలుగు మీటర్ల వెడల్పుతో గుట్టను గుహగా మలిచి, గుడిగా రూపుదిద్ది అందులో వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో భక్తులకు ఈ గుహ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



పరమదాసు చెక్కిన గుహ

ఇలా చేరుకోవచ్చు..

మోమిన్‌పేట మండల కేంద్రానికి 9కిలో మీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. వికారాబాద్ నుంచి సదాశివపేట, సదాశివపేట నుంచి వికారాబాద్ వెళ్లే మార్గంలో వెల్‌చాల్ బస్టాండు వద్ద బస్సు దిగి అక్కడి నుంచి 2 కిలోమీటర్లు ఆటోలో వెళ్లాలి. ప్రతీ 20 నిమిషాలకు ఓ బస్సు ఉంటుంది. వికారాబాద్, జహీరాబాద్‌ల నుంచి రైలు సౌకర్యం కూడా కలదు. వెల్‌చాల్ సమీపంలోని సదాశివపేట రోడ్డుస్టేషన్‌లో దిగి ఆటోలో చేరుకోవచ్చు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం



మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

పరిగి: శ్రీ లక్ష్మీవేంకటేశ్వస్వామి 38వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి నిర్వహిస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పార్థసారథి పేర్కొన్నారు. శనివారం ఆలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9, 10, 11 తేదీలలో ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా దేవాదాయ శాఖ ఆధీనంలోకి వచ్చాక తొలిసారిగా ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు గోపాల్, నర్సింహులు, బాబయ్య, రఘుమోహన్‌రెడ్డి, శశికళ, చిన్న నర్సింహులు, వెంకట్, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

17న గిరిజన కాంగ్రెస్ కార్యకర్తలకు శిక్షణ



శివరాం నాయక్

కుల్కచర్ల: ఈ నెల17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఆదివాసీ, గిరిజన కాంగ్రెస్ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆదివాసీ, గిరిజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శివరాం నాయక్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వికారాబాద్ జిల్లా పరిధిలోని ఆదివాసీ, గిరిజన కాంగ్రెస్ కార్యకర్తలకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. దీనికి రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షినటరాజన్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, కొడంగల్ ఇంచార్జి తిరుపతిరెడ్డి, తాండురు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఆయా ప్రాంతాల నేతలు హాజరవుతారని ఆయన తెలిపారు.

మహిళా సాధికారతే లక్ష్యం

నియోజకవర్గంలో ఆయా మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. మహిళా సాధికారత దిశగా సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా మహిళలు చైతన్యవంతులు కావాలన్నారు. అనంతరం ఆయా రంగాల్లో సేవ చేసిన మహిళలను గుర్తించి శాలువా కప్పి సన్మానించారు.



అనంతగిరి: ఆర్టీసీ బస్టాండ్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎం అరుణ



తాండూరు టౌన్: మాట్లాడుతున్న సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు విజయలక్ష్మీ పండిట్



దౌల్తాబాద్: గోకఫసల్వాద్‌లో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు



తాండూరు టౌన్: పండ్లు, వాటర్ బాటిళ్లు అందజేస్తున్న మార్వాడీ యువమంచ్ సభ్యులు



బంట్వారం: కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో సిబ్బందిని సత్కరిస్తున్న ఎస్‌ఐ గఫార్



నవాబుపేట: మహిళా కానిస్టేబుల్‌ని సన్మానిస్తున్న ఎస్‌ఐ అరుణ్‌కుమార్



దోమ: ఊటుపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి విజయ్ తదితరులు



తాండూరు టౌన్: జెండా ఆవిష్కరిస్తున్న మహిళా సమాఖ్య సభ్యురాలు పద్మ



అనంతగిరి: డిపోలో జరిగిన ఉత్సవాల్లో పాల్గొన్న ఎస్‌ఐ విమల



మర్పల్లి: కమ్యూనిటీ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది, శానిటేషన్ సిబ్బందితో..



కుల్కచర్ల: మహిళా అధికారులను సన్మానిస్తున్న నేతలు

మహిళల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం దోమ మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఇందిరా మహిళ శక్తి స్వగృహ క్యాంటీన్‌ను సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో పాటు మహిళ సంఘాల ద్వారా రుణాలను అందిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు.

రూ.87లక్షలతో సీసీ రోడ్లు..

గ్రామాల్లో సీసీ రోడ్లు వేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతుంది. ఈ నేపథ్యంలో దోమ మండలంలోని రాకొండ, బ్రాహ్మణపల్లి, బ్రాహ్మణపల్లితండా, గంజిపల్లి, గొట్లచెల్కతండా, దిర్సంపల్లి, కొండాయపల్లి, బట్లచందారం, మల్లేపల్లి, దాదాపూర్, కొత్తపల్లి, బొంపల్లి, గుండాల గ్రామాలలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.87 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.



ఇందిరా మహిళ శక్తి స్వగృహ క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

తాగునీటికి గోస

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న దాస్యనాయక్ తండావాసులు
- బోరు పాడై నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు

కుల్కచర్ల: తాగునీరు సరిపడ అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని దాస్యనాయక్ తండావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం కుల్కచర్ల మండలం దాస్యనాయక్ తండాలో మహిళలు, గ్రామస్తులు ఖాళీ బిందెలతో పాడైన బోరు దగ్గరికి వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తండాలో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అసలే వేసవి కాలం ప్రారంభమైందని, రానున్న కాలంలో తాగునీటికి ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై ఎంపీడీఓ రామకృష్ణను వివరణ కోరగా సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానన్నారు.



పాడైన బోరు వద్ద ఆందోళన నిర్వహిస్తున్న మహిళలు, గ్రామస్తులు

ఎమ్మెల్యే బీఎమ్మార్ చేతల మనిషి



తాండూరు రూరల్: మల్కాపూర్‌లో లింక్‌రోడ్డు పనులు ప్రారంభిస్తున్న రాందాస్ తదితరులు

మల్కాపూర్ లింక్ రోడ్డు పనులు ప్రారంభం

తాండూరు రూరల్: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాటల మనిషి కాదని.. చేతల మనిషి అని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుర్రంపల్లి రాందాస్ పేర్కొన్నారు. శనివారం కోట బాసుపల్లి నుంచి మల్కాపూర్ లింక్‌రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాందాస్ మాట్లాడుతూ.. సీఆర్‌ఆర్ గ్రాంట్ల ద్వారా తాండూరు మండలంలోని ఆయా గ్రామాలకు లింక్‌రోడ్ల నిర్మాణానికి రూ.16 కోట్ల 30లక్షలు మంజూరయ్యాయన్నారు. ఇందులో భాగంగా కోట బాసుపల్లి నుంచి మల్కాపూర్‌కు వెళ్లేందుకు 2కిలో మీటర్ల సీసీరోడ్డుకు రూ.1 కోటి 30 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషితో రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు.



కుల్కచర్ల: సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చౌడాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొత్తఉమాపతిరెడ్డి పేర్కొన్నారు. శనివారం చౌడాపూర్ గ్రామంలో రూ.5లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి సాధించాలంటే ఆ గ్రామాల్లో రహదారులు సక్రమంగా ఉండాలన్నారు. వాణిజ్యపరమైన లావాదేవీలు జరిగినప్పుడే గ్రామీణ ప్రాంతాలు ఆర్థికంగా అభివృద్ధిని సాధిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సలీం, యాదయ్య, రాము, చిన్నయ్య, కృష్ణయ్య, అంజి, గోపాల్, మల్లయ్య, సంపత్, సత్యం, సాయి, శరత్‌కుమార్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే!

- ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- కంచె ఏర్పాటు చేయాలని స్థానికుల వినతి

కొత్తూరు: కంచెలు లేని, రోడ్లు, ఇళ్ల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా ప్రమాదాలు జరిగి ప్రజలు, మూగజీవాలు బలవుతున్నాయి. అయినప్పటికీ స్థానిక ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లను సరి చేయడం లేదు. మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో ప్రధాన కూడలి వద్ద ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె చాలా కిందకు ఉంది. మూగ జీవాలు, ప్రజలు గమనించకుండా సమీపం నుంచి వెళ్లి ప్రమాదానికి గురయ్యే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఎత్తు పెంచడంతో పాటు కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి ఉజ్వల భవిష్యత్ పొందాలని ఎంఈఓ మనోహర్ ఆకాంక్షించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రసూల్ ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయిలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందన్నారు. ఏదైనా సాధించాలనే కృషి పట్టుదల ఉంటే విజయతీరాలకు చేరుకుంటారన్నారు. ప్రణాళికలను రూపొందించుకొని లక్ష్య సాధనకు నిరంతరం శ్రమిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. ఉన్నత విద్యావంతులుగా ఎదిగినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడి, భయాందోళనకు గురికాకుండా సంసిద్ధులు కావాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్మయ్య, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ పండుగ బాల్‌రాజ్, అనురాధ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మొయినాబాద్ రూరల్: అమ్డాపూర్ మల్లికార్జున స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మూడురోజుల పాటు జరిగే స్వామివారి ఉత్సవాల్లో భాగంగా శనివారం మొదటిరోజు పుట్టపూజ, గంగతెప్ప కార్యక్రమాలు యాదవులు ఘనంగా నిర్వహించారు. రెండోరోజు ఆదివారం మల్లికార్జునస్వామి కల్యాణం, బోనాల ఊరేగింపు, అగ్ని గుండాలు, సదర్ పట్టాలు, గోలుసు తెంపుట, మహామంగళహారతి నిర్వహిస్తారు. మూడోరోజు సోమవారం స్వామివారికి నైవేద్య సమర్పణతో ఉత్సవాలు ముగియనున్నట్లు యాదవ సంఘం సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.